క్లుప్తంగా

గుర్తింపు కార్డులు పంపిణీ



గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న డీఐఈవో

చిగురుమామిడి: పదో తరగతి పూర్తి చేసి ఇంటర్‌లో చేరిన ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ, సభ్యతా సంస్కారం అవర్చుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాఅధికారి గంగాధర్ సూచించారు. గురువారం చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పట్టుదలతో విద్యనభ్యసిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని, క్లాసులకు దుమ్మాకొట్టొద్దని ప్రతిరోజు అధ్యాపకులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వినాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శశిధర్ శర్మ, అధ్యాపకులు మహేందర్, లైబ్రేరియన్ చంద్రశేఖర్, సంపత్‌కుమార్, రవికుమార్, కృష్ణమోహన్, అనిత, మమత, కవిత, జూనియర్ అసిస్టెంట్ వలీపాషా, ఆఫీస్ సబార్డినేట్ తిరుపతి విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో యూరియా కష్టాలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ నాయకులు కళ్లు ఉండి చూడలేకపోతున్నారని, గాయత్రి పంపుహౌజ్ వద్దకు బాహుబలి మోటార్ల ద్వారా నీరు ఎక్కడ నుంచి వస్తుందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గాయత్రి పంపుహౌజ్‌కు నీరు పంపింగ్ చేయడంతో గ్రావిటీ కాలువలోకి వెళ్తున్న నీటికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని విమర్శిస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఈ నీరే గొప్ప నిదర్శనమని, ఆరువందల మీటర్ల ఎత్తుకు నీరు వస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, బీఆర్‌ఎస్ పోరాటంతోనే ప్రభుత్వం దిగివచ్చి నీటిని విడుదల చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు యూరియా కోసం నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తవుటు మురళి, నాయకులు గంట్ల వెంకట్‌రెడ్డి, కరబూజ తిరుపతిగౌడ్, ఒంటెల వెంకటరమణారెడ్డి, జూపాక మునీందర్, సైండ్ల కరుణాకర్ పలువురు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



మందులు పరిశీలిస్తున్న చందు

శంకరపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో చందు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డెంగీ, టైఫాయిడ్‌కు సంబంధించిన మందులను పరిశీలించారు. వివిధ రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



గంగాధర: రోడ్డు భద్రతా, ప్రమాదాల నివారణపై ప్రచురించిన పోస్టర్లను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వంశీకృష్ణ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పోస్టర్లు ఉపయోగపడుతాయన్నారు. వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. నాయకులు పెరుక శ్రావణ్, పంజాల ప్రశాంత్, రేండ్ల శ్రీనివాస్, వొడ్నాల రాజు, గంగాధర రవి, తాళ్ల రాజశేఖర్, అర్ష రాజు, పెరుక మహేశ్, సుంకర అనిల్, గుండా అఖిల్, పెరుక భాస్కర్, శ్రీనివాస్, దొడ్ల ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు బానిసవ్వొద్దు



హుజూరాబాద్: మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని ఏఎస్‌ఐ కమల అన్నారు. పట్టణంలో గురువారం మత్తు పదార్థాలు, ర్యాగింగ్, గంజాయి వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు బానిసై విలువైన జీవితం నాశనం చేసుకోవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రమాదాలు జరిగితేనే

స్పందిస్తారా?

- రోడ్డుపై కంకర, మట్టి కుప్పలు
- అదుపు తప్పుతున్న వాహనదారులు



ఫోర్‌లైన్ రోడ్డుపై అడ్డంగా మొరం కుప్పలు

వీణవంక: వరంగల్ జిల్లాకు చెందిన ఇసుక లారీ వీణవంక మండలంలోని ఓ క్వారీ వద్దకు మంగళవారం ఇసుక కోసం వెళ్తుండగా నర్సింగాపూర్ గ్రామానికి రాగానే రోడ్డుపై ఉన్న మొరం కుప్పలను గమనించకుండా ఎక్కించాడు. తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అదేవిధంగా ఇటీవల చిట్యాల మండలానికి చెందిన ఓ కారు అదుపు తప్పి కంకర కుప్ప ఎక్కడంతో అందులోని నలుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయపడ్డారు. జమ్మికుంటకు చెందిన ద్విచక్ర వాహనదారుడు మానకొండూరు మండలం పచ్చునూరులో ఓ శుభకార్యానికి వెళ్తుండగా అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు హెల్మెట్ ఉండటంతో చిన్నచిన్న గాయాలతో బయటపడ్డాడు. రోడ్డుపై అడ్డంగా మొరం, కంకర కుప్పలు పోయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



నర్సింగాపూర్ వద్ద రోడ్డుపై కంకర కుప్పలు

నత్తనడకన పనులు..

ఆబాదీ జమ్మికుంట నుంచి నర్సింగాపూర్ వరకు ఏడేళ్ల క్రితం ఫోర్‌లైన్ రోడ్డు మంజూరైంది. అదేవిధంగా నర్సింగాపూర్ నుంచి వీణవంక ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు మూడేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. కాగా పనులు ఏళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. నర్సింగాపూర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు కొంత దూరం కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేశాడు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నర్సింగాపూర్‌ను ఆనుకొని కొద్ది దూరంలో మొరం కుప్పలు భారీ ఎత్తుగా, మరికొంత దూరంలో కంకర కుప్పలు పోశారు. ఈ కుప్పలతో రోడ్డు ఇరుకుగా మారింది. రాత్రివేళ వాహనదారులు గమనించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మొరం, కంకర కుప్పలను రోడ్డుపై నుంచి తొలగింపజేయాలని, పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఇల్లందకుంట: మండలంలోని చిన్నకోమిటిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రం మరుగుదొడ్డి నిర్మాణ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిపోయాయి. సెప్టిక్ ట్యాంక్ కోసం గుంతను తవ్వి దానిపై తాత్కాలికంగా సిమెంట్ రేకులు వేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంత నీటితో నిండుకుంది. గుంతతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జ్యోతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఇల్లందకుంట నం.94949 94650

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

హుజూరాబాద్: పర్యావరణ పరిరక్షణ విద్యార్థి దశ నుంచే అలవాటు కావాలని మున్సిపల్ సమ్మయ్య అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం స్వచ్ఛ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ఆచరించాల్సిన అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. దేశ భవిష్యత్ తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని, విద్యార్థి దశ నుంచే మొక్కలు మానవ మనుగడకు జీవనాధారమని, ముందు తరాలకు అద్భుతమైన పరిశుభ్రమైన వాతావరణం అందించాలంటే అది చెట్ల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో భూపతి శ్రీనివాస్‌తో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుమల, మున్సిపల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి, ట్రస్మా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు ఉన్నారు.



హుజూరాబాద్: విజేతలకు బహుమతి అందిస్తున్న అధికారులు

మోడల్ స్కూల్ విద్యార్థికి జిల్లా స్థాయి బహుమతి

రామడుగు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని ఆర్. స్రవంతి జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా బహుమతి అందుకోవడం పాఠశాలకు గర్వకారణమన్నారు. గురువారం స్రవంతిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు రత్నాకర్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో చేరిక

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన 60 మంది సీఐటీసీయూ కార్మికులు గురువారం ఏఐటీయూసీలో చేరారని సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సదానందం, వెంకటరమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రవీణ్ కుమార్ అరెస్ట్ సిగ్గుచేటు

చొప్పదండి: పోడు భూముల పట్టాల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు మద్దతుగా నిలిచినా బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్వై నియోజకవర్గ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ విమర్శించారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రగా హైదరాబాద్‌కు వెళ్తుంటే అడ్డుకోవడం దుర్మార్గమని, నిరసన తెలిపే హక్కు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు.

జమ్మికుంట: ప్రవీణ్‌కుమార్ అరెస్ట్‌ను ఖండిస్తున్నామని స్వేరోస్ జిల్లా అధికార ప్రతినిధి అకినపల్లి ప్రవీణ్ అన్నారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామనే హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులను విడుదల చేయాలన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

హుజూరాబాద్: పట్టణంలోని మోడల్ చెరువు సమీపంలో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను 17వ వార్డులోకి మార్చాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకుడు ఖాలీద్ హుస్సేన్ గురువారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతిపత్రం సమర్పించారు. వార్డులో మార్చటం ద్వారా ప్రజలకు ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు.

'జాండీస్' కలకలం

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామంలోకొద్ది రోజులుగా జాండీస్(పచ్చకామెర్లు) కలకలం రేపుతుంది. ఇప్పటి వరకు సుమారు 50 మందికి పైగా వ్యాధి సోకినట్లు సమాచారం. ఓ యువకుడికి జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.నలభై వేలు వెచ్చించినా నయం కాలేదని వాపోయాడు. మరో యువతికి రూ.ఇరవై వేల వరకు ఖర్చు అయిందని గ్రామస్తులు తెలిపారు. రెండో వార్డులో వ్యాధి బారిన పడినవారు ఎక్కువగా ఉన్నారని, జాండీస్ లక్షణాలు ఉన్న వ్యక్తులు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని, మంచినీరు కలుషితమం కావడం తోనే వ్యాధి వ్యాప్తి చెందుతుందని, వైద్యాధికారులు గ్రామంలో పర్యటించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

22న యోగాసన పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: స్థానిక ప్రాంతీయ క్రీడా పాఠశాలలోని యోగా హాల్‌లో 22న కరీంనగర్ జిల్లా స్థాయి సీనియర్స్ యోగాసన ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ రవీందర్ సింగ్, నాగిరెడ్డి సిద్ధారెడ్డి ప్రకటనలో తెలిపారు. వివరాలకు 8985275068, 7893434 987, 9177948868 నంబర్లు సంప్రదించాలన్నారు.

వ్యక్తిపై కేసు

వీణవంక: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కేతిరెడ్డి శ్రీలత ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలు, కారు అద్దాలు పగలకొట్టి విలువైన వస్తువులు ఎత్తికెళ్లిన ఆమె అన్న మాడ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. శ్రీలత, కృష్ణారెడ్డి మధ్య ఆస్తి గొడవలు జరుగుతున్నాయి. కోర్టులో కేసులు నడుస్తుండగా బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చి నష్టం చేశాడని శ్రీలత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.



గంగాధర: తిరంగా ర్యాలీలో విద్యార్థులు, నాయకులు



చొప్పదండిలో నాయకుల బైక్ ర్యాలీ

ఘనంగా తిరంగా ర్యాలీ

చొప్పదండి: దేశ సమగ్రత, సుస్థిరత లక్ష్యంగా బీజేపీ దేశ వ్యాప్తంగా తిరంగా ర్యాలీలు నిర్వహిస్తోందని, భారత్ సాధించిన ఆర్థిక, సైనిక విజయాలు, ప్రతి ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించడమే ర్యాలీ ఉద్దేశమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలో గురువారం నిర్వహించిన తిరంగా ర్యాలీలో మాట్లాడారు. చొప్పదండిలో ప్రారంభమైన బైక్ ర్యాలీ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఖలిస్థాన్ ఏర్పాటు వాదులకు దేశంలోని కొన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వడం విచారకరమన్నారు. కార్యక్రమంలో మొగిలి మహేశ్, బత్తుల లక్ష్మీనారాయణ, గుంట రవి, తోట కోటేశ్, గొల్ల గట్టయ్య, సింగిరెడ్డి భూంరెడ్డి, విలాసాగరం అంజయ్య, దొంతిసారపు సంపత్, కుమార్, వీరేశం, రాజేందర్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: స్వాతంత్ర్య దినోత్సం పురస్కరించుకొని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు తిరంగా యాత్ర చేపట్టారు. పట్టణ శివారు కేసీ క్యాంపులోని మహాత్మా గాంధీ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలలు వేశారు. అనంతరం జాతీయ జెండాలతో భారత్ మాతాకీ జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీజే పీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, నాయకులు గంగిశెట్టి ప్రభాకర్, రాజు ఉన్నారు.



హుజూరాబాద్‌లో...

గంగాధర: మండలంలోని మధురానగర్‌లో బీజేపీ నాయకులు తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచే త్రివర్ణ పతాక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పడానికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించామని పార్టీ మండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ తెలిపారు. ర్యాలీలో ఎస్సై వంశీకృష్ణ, నాయకులు వైద రామానుజం, దూలం కళ్యాణ్ తూం నారాయణ, సదాల భాస్కర్, మల్యాల వినయ్‌సాగర్, శ్రీపతి రాజేంద్రప్రసాద్, రేండ్ల శ్రీనివాస్, గాలిపల్లి శ్రీనివాస్, మోతె నర్సింహరెడ్డి, వొడ్నాల రాజు, గంగాధర రవి, హర్షరాజు వివేకానంద విద్యాలయం, సురభి హైస్కూల్, విన్నర్స్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని వివిధ గ్రామాలలో బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్, నాయకులు వెంకట్‌రెడ్డి, కొమురయ్య, సమ్మిరెడ్డి, జైపాల్, నరేందర్, రాజు, శ్రీనివాస్, సాగర్, సారయ్య పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు భిక్ష

జమ్మికుంట: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేశినికోటి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు గురువారం భిక్ష ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్‌బాబు జన్మదినం పురస్కరించుకొని భిక్ష నిర్వహించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రణవ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కోకన్వీనర్ దొంత రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, బ్లాక్ అధ్యక్షుడు సదానందం, మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, పానగంటి సారంగం, నాయకులు రామిరెడ్డి, తిరుపతి, పర్లపల్లి నాగరాజ్, పంజాల అజయ్, వినయ్, సంపత్, మైస మహేందర్ పాల్గొన్నారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

చిగురుమామిడి: మండల కేంద్రంలో మాజీ వైస్ ఎంపీపీ ఆకవరం భవాని-శివప్రసాద్ దంపతుల కొడుకు సాయి వివాహం బుధవారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ గురువారం నూతన దంపతులను ఆశీర్వదించారు. ఇదే గ్రామానికి చెందిన చెరుకు సుధాకర్ కొడుకు హరీశ్-వర్షినీ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వెంట బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరింది

వీణవంక: పదేళ్ల నిరీక్షణ తర్వాత నిరుపేదల సొంతింటి కల నెరవేరుతుందని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్‌బాబు అన్నారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇల్లు మొదటి గృహ ప్రవేశం మండలంలోని శ్రీరాములపేటలో గురువారం జరిగింది. ప్రణవ్ హాజరై లబ్ధిదారుడిని అభినందించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇల్లు నిర్మించుకోవడానికి కృషి చేసిందని, పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క ఇల్లు నిర్మించలేదని, నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, మరో వెయ్యి ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భగవాన్‌రెడ్డి, ఎండీ సాహెబ్ హుస్సేన్, గంగాడి తిరుపతిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మాదాసు సునీల్, శ్రీపతిరెడ్డి, కొండాల్‌రెడ్డి, సిద్ధపల్లి మహిపాల్‌రెడ్డి, కురిమిండ్ల తిరుపతి, సమ్మిరెడ్డి, మాసాడి చొక్కరావు, చదువు జయపాల్‌రెడ్డి ఉన్నారు.



చొప్పదండిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఇల్లందకుంట: చిన్నకోమటిపల్లి పాఠశాలలో



ఇల్లందకుంట: రాచపల్లిలో ఉట్టికొడుతున్న చిన్నారులు

ముందస్తు శ్రీకృష్ణాష్టమి

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషాధారణలతో పాఠశాలలకు చేరుకున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అంబరన్నంటాయి. ఉపాధ్యాయులు పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల్లో టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో...



చిగురుమామిడి: ఇందుర్తిలో..

మృతుల కుటుంబాలకు చేయూత

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్, గోపాల్‌పూర్, హన్మాజీపల్లె గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను బీజేపీ మానకొండూర్ నియోజకవర్గం కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఎంజేఆర్ యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి ఇరవైఐదు కిలోల బియ్యం, ఐదులీటర్ల మంచి నూనే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు నగునూరి శంకర్, తాళ్లపల్లి పర్శరామ్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్, వీరగోని వెంకటేష్, భూంపెల్లి గోవర్ధన్‌రెడ్డి, న్యాలపట్ల రవి, చొక్కల లక్ష్మయ్య, బామండ్ల రాజు, నందికొండ సురేందర్ రెడ్డి, గుంటి అంజి, కొంకటి శివకృష్ణ, అమ్మిగల్ల సతీష్, సుమన్, బామండ్ల వంశీ పాల్గొన్నారు.

రైతులకు తప్పని యూరియా తిప్పలు



హుజూరాబాద్: వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో రైతులు యూరియా కోసం ప్రాథమిక సహకార సంఘాల ఎదుట క్యూ కడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎరువుల కోసం అవస్థలు పడుతున్నారు. మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయానికి యూరియా కోసం రైతులు భారీగా చేరుకున్నారు.

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి పీఏసీఎస్‌కు యూరియా బస్తాలు వచ్చాయని తెలియడంతో గురువారం రైతులు కార్యాలయం ఎదుట క్యూ కట్టారు.